అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 281 | వరంగల్ | బుధవారం, 12 ఆగస్టు 2026 | పేజీలు: 6

మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పౌర సరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిని వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. - అక్షరశక్తి, హైదరాబాద్






# మిల్లర్ల బకాయిలు వసూలు చేయాల్సిందే..

2

- ఈ మేరకు విధివిధానాలను రూపొందించాలి
- ఎగవేతలకు పాల్పడేవారితో కఠినంగా వ్యవహరిస్తాం..
- మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తాం..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పౌర సరఫరాల శాఖపై ఉత్తమ్‌తో కలిసి సమీక్ష




## ఇజ్రాయెల్ పట్టణ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

పట్టణాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలు, సమర్థవంతమైన పాలనా వ్యవస్థలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు.
- అక్షరశక్తి,హనుమకొండ

3

## కెపాసిటర్ బ్యాంకులతో విద్యుత్ నష్టాల తగ్గింపు

- వ్యవసాయ ఫీడర్లలో తక్కువ వోల్టేజ్ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం
- అదనపు PTRల ఏర్పాటు అవసరాన్ని తగ్గిస్తున్న కెపాసిటర్ బ్యాంక్స్
- అటవీ ప్రాంతాల్లో 8 వోల్టేజ్ బూస్టర్ల ఏర్పాటు: టిజిఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి




2

## ఆగస్టు 13న హనుమకొండలో ఘనంగా 'తిరంగా యాత్ర'



**అక్షరశక్తి, హనుమకొండ:** దేశభక్తి, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని చాటిచెప్పేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 13న హనుమకొండలో 'తిరంగా యాత్ర' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మ రెడ్డి తెలిపారు. ఆగస్టు 13న మధ్యాహ్నం 3 గంటలకు చారిత్రాత్మక వేయి స్తంభాల గుడి నుంచి యాత్ర ప్రారంభమై, అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతీయ జెండా గౌరవాన్ని చాటుతూ, దేశ ఐక్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో హనుమకొండ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపార ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, మహిళలు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావు పద్మ రెడ్డి పిలుపునిచ్చారు.

## హెచ్‌సీయూలో గంజాయి కలకలం..

### 17 మంది విద్యార్థులకు పాజిటివ్

**అక్షరశక్తి,హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గంజాయి వ్యవహారం కలకలం రేపింది. గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు యూనివర్సిటీ ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు డ్రగ్ పరీక్షలు నిర్వహించగా 17 మంది విద్యార్థులకు గంజాయి వినియోగించినట్లు పరీక్షల్లో తేలినట్లు సమాచారం. దీంతో యూనివర్సిటీలో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతను హెచ్‌సీయూలో గతంలో చదువుకున్న పూర్వ విద్యార్థిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అతని వద్ద నుంచి 10 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అసోం నుంచి గంజాయిని తీసుకువచ్చి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని ఈగల్ టీమ్ విచారిస్తోంది. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గంజాయి వినియోగం, సరఫరా వ్యవహారం వెలుగులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## కాశగూడెం పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**అక్షరశక్తి,ధర్మసాగర్:** ధర్మసాగర్ మండలం కాశగూడెం గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఒక జత దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ సయ్యద్ సత్తార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సయ్యద్ సత్తార్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి అవసరాలను గుర్తించి సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇలాంటి సహాయ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కెపాసిటర్ బ్యాంకులతో విద్యుత్ నష్టాల తగ్గింపు

- వ్యవసాయ ఫీడర్లలో తక్కువ వోల్టేజ్ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం
- అదనపు PTRల ఏర్పాటు అవసరాన్ని తగ్గిస్తున్న కెపాసిటర్ బ్యాంక్స్
- అటవీ ప్రాంతాల్లో 8 వోల్టేజ్ బూస్టర్ల ఏర్పాటు: టిజిఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి











**అక్షరశక్తి, హనుమకొండ:** టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో సుమారు 14 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ఉండటంతో గ్రామీణ విద్యుత్ ఫీడర్లపై ఇండక్షన్ లోడ్ అధికంగా ఉండటం వలన దీనివల్ల పవర్ ఫ్యాక్టర్ తగ్గి, విద్యుత్ ప్రవాహం పెరిగి వోల్టేజ్ డ్రాప్ ఏర్పడుతుంటదని ఈ సమస్యలకు పరిష్కారంగా టీజీఎన్‌పీడీసీఎల్ ఇప్పటికే 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో 2 MVAR కెపాసిటర్ బ్యాంకులు 303, 1 MVAR కెపాసిటర్ బ్యాంకులు 89 గత రెండున్నర సంవత్సరాలలో ఏర్పాటు చేశామని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. రైతాంగానికి నాణ్యమైన, స్థిరమైన వోల్టేజ్‌తో విద్యుత్ సరఫరా అందించడంతో పాటు సాంకేతిక విద్యుత్ నష్టాలను గణనీయంగా తగ్గినాయని, ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో మోటార్ల కారణంగా ఏర్పడే రియాక్టివ్ పవర్ డిమాండ్‌ను నియంత్రించేందుకు సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్ల వద్ద కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశామని చెప్పారు.

392 కెపాసిటర్ బ్యాంకుల ద్వారా పిటిఆర్ సామర్థ్యం ఉపశమనం అవుతోంది అన్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో వెంటనే అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఉండదని పేర్కొన్నారు.

కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో అదనపు 66 కొత్త PTRల ఏర్పాటు అవసరం లేదని, తద్వారా 21 కోట్ల మేర డబ్బులు ఆదా అవుతుందని పేర్కొన్నారు. 11 కేవీ ఫీడర్లలో కెపాసిటర్ బ్యాంకులు పెట్టడం వలన సుమారు 82 కోట్ల మేర సాంకేతిక నష్టాలు తగ్గినాయని పేర్కొన్నారు,. విద్యుత్ నష్టాల తగ్గింపులో సానుకూల ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. సబ్‌స్టేషన్ స్థాయిలో 2 MVAR కెపాసిటర్ బ్యాంకులతో పాటు 11 కేవీ ఫీడర్ స్థాయిలో 600 kVAR సామర్థ్యం కలిగిన కెపాసిటర్ బ్యాంకులను కూడా ఏర్పాటు చేశామని, లైన్లలో వోల్టేజ్ డ్రాప్ తగ్గి, ముఖ్యంగా ఫీడర్ చివరి ప్రాంతాల్లో వోల్టేజ్ ప్రొఫైల్ మెరుగుపడుతుంది. ఫలితంగా వ్యవసాయ పంపుసెట్లతో పాటు ఇతర వినియోగదారులకు కూడా మరింత స్థిరమైన వోల్టేజ్ అందుతుందని అన్నారు. పవర్ ఫ్యాక్టర్ మెరుగుదల:

కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుతో సబ్‌స్టేషన్ల వద్ద పవర్ ఫ్యాక్టర్ కూడా గణనీయంగా మెరుగుపడుతుంది అని అన్నారు. ముఖ్యంగా అగ్రికల్చర్ ఫీడర్లలో తక్కువ వోల్టేజ్ సమస్య రాకుండా కెపాసిటర్ బ్యాంకులు, వోల్టేజ్ బూస్టర్లు పెట్టడం వలన రైతాంగానికి మెరుగైన వోల్టేజ్ అందుతుందన్నారు . అటవీ ప్రాంతాలు, పొడవైన లైన్లు ఉన్న ప్రాంతాల్లో ప్రతి సమస్యకు కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాని పరిస్థితుల్లో, అవసరాన్ని బట్టి వోల్టేజ్ బూస్టర్లను ఏర్పాటు చేయడం ద్వారా వోల్టేజ్ సమస్యను పరిష్కరించామన్నారు . ఈ క్రమంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో అటవీ ప్రాంతాలు మరియు సుదూర ప్రాంతాల్లో మొత్తం 8 వోల్టేజ్ బూస్టర్లు పెట్టమని చెప్పారు.

## లాల్ బహదూర్ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం

**అక్షరశక్తి,వరంగల్:** లాల్ బహదూర్ కళాశాలలో 10వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని పెంపొందించేందుకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. అరుణ డీఎస్ రావు తెలిపారు. డీజీఎన్‌సీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, కెడెట్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ డా. ఎం. సదానందం, రవళి, రశ్మిత, గోకుల్, షాహీల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



అక్షరశక్తి Evening Daily
3
బుధవారం, 12 ఆగస్టు 2026
Telugu Trending News

# ఇజ్రాయెల్ పట్టణ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం






## కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్



**అక్షరశక్తి,హనుమకొండ:** పట్టణాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు నీటి వనరులను సమర్థ వంతంగా వినియోగించుకోవడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలు, సమర్థవంతమైన పాలనా వ్యవస్థలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ఇజ్రాయెల్‌లోని వివిధ నగరాల్లో అర్బన్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై నిర్వహించిన అధ్యయన పర్యటనలో కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌లో పట్టణ నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, మురుగు నీటి శుద్ధి, పునర్వినియోగం, నీటి మౌలిక వసతుల నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి కొరతను సవాలుగా కాకుండా సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థవంతమైన పాలన ద్వారా అవకాశంగా మార్చుకోవడంలో ఇజ్రాయెల్ అనుభవాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. సముద్రపు నీటిని శుద్ధి చేసి వినియోగించడం, శుద్ధి చేసిన మురుగునీటిని దాదాపు 90 శాతం వరకు వ్యవసాయ అవసరాలకు పునర్వినియోగించడం, GIS ఆధారిత నీటి మౌలిక వసతుల మ్యాపింగ్, నాన్‌రెవెన్యూ వాటర్ (NRW)ను 5 శాతం కంటే తక్కువ స్థాయిలో నియంత్రించడం వంటి విధానాలు పట్టణ నీటి నిర్వహణలో ఇజ్రాయెల్ సాధించిన పురోగతికి నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా నదుల పునరుజ్జీవనం, పట్టణ జల వనరుల పరిరక్షణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, ఎడారీకరణ నివారణకు చేపడుతున్న పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నీటి నిర్వహణలో విస్తృతంగా వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసినట్లు తెలిపారు. అధ్యయన పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్‌లో భారత రాయబారి శ్రీ జె.పి. సింగ్‌ను కలుసుకుని భారత్-ఇజ్రాయెల్ సహకారం, ముఖ్యంగా పట్టణ నీటి నిర్వహణ రంగంలో ఇరు దేశాల మధ్య ఉన్న అవకాశాలు, అనుభవాలపై ఆయన నుంచి విలువైన సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నట్లు కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా పొందిన అనుభవాలు వరంగల్ నగర అండర్‌గ్రౌండ్ సీవరేజ్ సిస్టమ్ (UGSS), తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, GIS ఆధారిత నీటి మౌలిక వసతుల నిర్వహణ, నాన్‌రెవెన్యూ వాటర్ తగ్గింపు, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పట్టణ చెరువులు, కుంటలు, ఇతర జల వనరుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాల్లో ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అధ్యయన పర్యటనలో ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో పాటు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యే, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ డైరెక్టర్లు, పట్టణాభివృద్ధి రంగానికి చెందిన అధికారులు, పాల్గొన్నారు.

# సభ్యుల సంక్షేమమే ప్రధానం..

**అక్షరశక్తి, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రతీ సభ్యుడి సంక్షేమమే తమ కమిటీ ధ్యేయమని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. ప్రమాదవశాత్తూ మృతిచెందిన క్లబ్ సభ్యుడు, దివంగత డెస్క్ జర్నలిస్ట్ రబ్బానిపాషా కుటుంబానికి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా 10.57 లక్షలు చెక్కును అందించేందుకు క్లబ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వేముల నాగరాజు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ అందించిన ఘనత గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కు, టీయూడబ్ల్యూజేఐజేయూ యూనియన్ కే దక్కిందని అన్నారు. సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచేందుకు చేయించిన భీమా , ఒక కుటుంబానికి ఆసరాగా నిలవటం గొప్పవిషయం అని చెప్పారు. గత ఏడాది సభ్యులకు చేసిన భీమాను ఈ ఏడాది కూడా రెన్యూవల్ చేయించేందుకు తమ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అనంతరం దివంగత జర్నలిస్ట్ రబ్బానిపాషా కుటుంబసభ్యులకు భీమా చెక్కును యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, క్లబ్ కమిటీ, యూనియన్ల బాధ్యులు, సీనియర్ జర్నలిస్టులతో కలసి అందించారు. రబ్బానిపాషా కుటుంబానికి క్లబ్ అండగా నిలుస్తుందని వారికి ఇన్సూరెన్స్ పాలసీ కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.





కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారం సదయ్య కోశాధికారి బొళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం కుమార్, బొడిగె శ్రీను, అల్లం రాజేష్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు, సంపేట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, పోడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ సభ్యులు,వీరగోని హరీష్, జనగాని ఆంజనేయులు, ఎండి నయీంపాషా,కమటం వేణుగోపాల్, నన్నపనేని భరత్ కుమార్, మంచాల రాజు, బలువారి విజయరాజ్, టీయూడ్ల్యూజేఐజేయూ హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతలు గాడిపెల్లి మధు, నేతలు పీవీ మదన్ మోహన్, సంగోజు రవి, వల్లాల వెంకటరమణ, కంకణాల సంతోష్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, సోమనర్సయ్య, పిన్నా శివకుమార్, సాక్షి ఎడిషన్ ఇంచార్జ్ వర్ధెల్లి లింగయ్య, ఉర్దూ జర్నలిస్టుల అసోసియేషన్ బాధ్యులు గుల్షన్, సాజీద్ పాషా, సయీద్, నయీం, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ డీఎం సతీష్, ఏడీఎం సంతోష్, సందీప్, వర్ధినేని లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి నివారణపై అవగాహన పెంపొందించాలి

### కలెక్టర్ డా. సత్య శారద




**అక్షరశక్తి,వరంగల్:** హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వరంగల్ జిల్లాలో రెండు నెలల ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాప్తి మార్గాలు, నివారణ పద్ధతులు, ముందస్తు పరీక్షలు, చికిత్స సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు డీఏపీసీయూ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపెయిన్‌లో భాగంగా 200 గ్రామాలు, 200 పాఠశాలలు, 50 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఎంపిక చేసిన ప్రాంతాల్లో 4 వేల ఇళ్లలో ఇంటింటి ప్రచారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు, 100 బైక్‌లతో ప్రజా అవగాహన ర్యాలీ చేపట్టనున్నారు. BREAK FREE APP ద్వారా డిజిటల్ రిస్క్ అసెస్‌మెంట్, హెచ్ఐవి పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. బి. రాజా రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రామ్ కుమార్ రెడ్డి, వైద్యాధికారులు, డీఏపీసీయూ సిబ్బంది, ఎన్‌జీఓ ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన అవసరం






**అక్షరశక్తి,హనుమకొండ:** అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్, ఎస్‌టీఐలపై విస్తృత అవగాహన కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎ. అప్పయ్య బుధవారం ప్రభుత్వ టీబీ ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు హెచ్ఐవీపై సమగ్ర సమాచారాన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా అందించేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన 'బ్రేక్ ఫ్రీ యాప్'ను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం యాప్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అధికారులు, అతిథులు ఆవిష్కరించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డా. మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు జిల్లాలోని 181 గ్రామాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, మహిళా సంఘాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యువత అపోహలకు దూరంగా ఉండి శాస్త్రీయ సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవి, ఆర్ఎంఓ డా. వెంకటరమణ, డీటీసీఓ డా. ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## దేశ పురోగతి, సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

**అక్షరశక్తి హనుమకొండ:** దేశ పురోగతి, సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని హనుమకొండ ట్రిబ్యునల్ కం లేబర్ కోర్టు చైర్మన్ డాక్టర్ తట్ట శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్ట లోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఈ. రామ చందర్ అధ్యక్షతన యువత సాధికరతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని యువతకు దిశా నిర్దేశం చేశారు. యువత కేవలం భవిష్యత్తు నాయకులు మాత్రమే కాదని వర్తమానంలో మార్పు తెచ్చే శక్తి సంపన్నులని తెలిపారు. యువతలో ఉన్న సృజనాత్మకత ఆలోచనలు నైపుణ్యాలను సరైన దిశలో నడిపించినప్పుడే దేశం సర్వతో ముఖాభివృద్ధికి సాదిస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న యువశక్తిని ఉపాధి నైపుణ అభివృద్ధి వైపు మళ్ళించాలని యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు నాణ్యమైన విద్య అందించేలా చూసేందుకు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. యువత మానసిక ఆరోగ్యం నిరుద్యోగం వంటి సవాళ్లను సవాళ్లను ఎదుర్కొంటున్న యువతకు అండగా నిలవాలని సూచించారు. యువత తమ లక్ష్యాల వైపు అడుగులు వేస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మట్టెవాడ మాధవ్, వంగ రాజేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం కవిత. ఏ కిరణ్ సింగ్, కె రవి, టి సుభాష్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## లింక్ ప్రొడక్ట్స్ విధానాన్ని రద్దు చేయాలి: ఎరువుల డీలర్లు



**అక్షరశక్తి,పరకాల:** మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లు వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) అవినాష్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ వివిధ ఎరువుల కంపెనీలు యూరియా, డీఏపీ వంటి ప్రధాన ఎరువులతో పాటు జింక్, బయో ఫర్టిలైజర్స్ తదితర ఉత్పత్తులను లింక్ ప్రొడక్ట్స్ పేరుతో తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. అవసరం లేని ఉత్పత్తులను కొనుగోలు చేయడం వల్ల పెట్టుబడి నిలిచిపోవడంతో పాటు, నిల్వలు పెరిగి డీలర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, కంపెనీల లింక్ విధానం వల్ల డీలర్లు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. లింక్ ప్రొడక్ట్స్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, డీలర్లపై బలవంతపు కొనుగోళ్లకు పాల్పడకుండా కంపెనీలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ అవినాష్ వర్మను కోరారు. డీలర్ల సమస్యలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## నేత కార్మికుడు వెంకటేశం కుటుంబానికి కేటీఆర్ పరామర్శ



**అక్షరశక్తి, సిరిసిల్ల :** సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకుల చేతిలో హత్యకు గురైన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. వెంకటేశం మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశం కూతురు చదువుతున్న స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి.. మీ శాతవాహన స్కూల్‌లో వాళ్ల పాప ప్రసన్న ఐదో తరగతి చదువుతుంది. మొత్తం ఆ అమ్మాయికి 10వ తరగతి దాకా నేనే చదవిపిస్తా. ఒక రూపాయి కూడా మీరు తీసుకోవద్దు. మొత్తం నేను కడతానని చెప్పారు. రూ.3 లక్షలు పాప పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేయించిన. ఇంకేమైనా ఉంటే కూడా నేను సాయం చేస్తానని భరోసానిచ్చారు. మీరు భయపడొద్దు. పాప చదువు బాధ్యత తీసుకోవడంతోపాటు ఇల్లు కట్టిస్తానని కేటీఆర్ హామీనిచ్చారు. వెంకటేశం మృతికి కారణమైన వారిని శిక్ష పడేంత వరకు వదిలిపెట్టనని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అజర హాస్పిటల్‌లో 7 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం



**అక్షరశక్తి,వరంగల్, ఆగస్టు 12:** వరంగల్‌లోని అజర హాస్పిటల్‌లో గత ఏడాది కాలంలో 7 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ, సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ ఉస్కే కిరణ్ ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్సలు నిర్వహించగా, అనస్థీషియా బృందానికి చెందిన డాక్టర్ పంకజ్ కుమార్ సింగ్, డాక్టర్ గణేష్ సురారం సహా మొత్తం ట్రాన్స్‌ప్లాంట్ బృందం కీలకంగా వ్యవహరించింది.

అజర హాస్పిటల్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకుని విజయవంతంగా కోలుకున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులు మాట్లాడుతూ కిడ్నీ సమస్యల సమయంలో వైద్యులు సరైన మార్గదర్శకత్వం అందించారని తెలిపారు. ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు అవసరమైన పరీక్షలు, చికిత్సా విధానం, శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను వైద్యులు వివరించారని, శస్త్రచికిత్స అనంతరం కూడా నిరంతర వైద్య పర్యవేక్షణ, ఫాలోఅప్ సేవలు అందుతున్నాయని చెప్పారు. కిడ్నీ మార్పిడి అనంతరం తమ ఆరోగ్యం మెరుగుపడి సాధారణ జీవితాన్ని కొనసాగించే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

అజర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, కిడ్నీ మార్పిడి వంటి అత్యాధునిక వైద్య సేవల కోసం వరంగల్ ప్రజలు ఇకపై తప్పనిసరిగా హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. 150 పడకల ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అజర హాస్పిటల్ NABH 6వ ఎడిషన్ అక్రిడిటేషన్ పొందిన ఆసుపత్రిగా రోగి భద్రత, నాణ్యమైన వైద్య సేవలు, అత్యున్నత వైద్య ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.కిడ్నీ వ్యాధులను తొలిదశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ఎంతో ముఖ్యమని డాక్టర్ వెంకటరమణ తెలిపారు. కిడ్నీ పనితీరు తీవ్రంగా దెబ్బతిన్న వారికి పరిస్థితిని బట్టి డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమవుతుందని వివరించారు. డాక్టర్ ఉస్కే కిరణ్ మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి అత్యంత సమన్వయంతో నిర్వహించాల్సిన క్లిష్టమైన ప్రక్రియ అని, నెఫ్రాలజీ, యూరాలజీ, అనస్థీషియా, క్రిటికల్ కేర్, నర్సింగ్ తదితర విభాగాల సమిష్టి కృషితోనే విజయవంతం చేయగలమన్నారు. అజర హాస్పిటల్‌లో 7 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం కావడం వరంగల్ వైద్యరంగంలో కీలక మైలురాయిగా నిలిచిందని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది.

## సీకేఎం కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకలు




**అక్షరశక్తి,వరంగల్:** సీకేఎం ప్రభుత్వ కళాశాలలో బుధవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్, డాక్టర్ యెస్.వి. నారాయణ స్మారక వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా కళాశాల గ్రంథాలయానికి రూ.30 వేల విలువైన పాఠ్య, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల పితామహుడు ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోషయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ మండలం నవీన్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్ రావు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల భావవ్యక్తీకరణ, మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్, సంస్థ వ్యవస్థాపకులు వొంగూరు విజయ్ భాస్కర్ రెడ్డి తరఫున పుస్తకాలను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. విరాళాలు అందించిన సంస్థలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎస్. అనిల్ కుమార్, అధ్యాపకులు కెప్టెన్ డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ అయేషా, డాక్టర్ వసుధ, వెంకటేశ్వర్లు, డాక్టర్ పూర్ణచందర్, సురేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

### జిల్లా కలెక్టర్ డా. సత్య శారద





**అక్షరశక్తి,వరంగల్:** జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని కంప్లైంట్ బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యలపై వివరాలను తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంజీఎం డైట్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు అందించే డైట్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జిలను ఆదేశించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్,డాక్టర్ అశ్విన్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# మిల్లర్ల బకాయిలు వసూలు చేయాల్సిందే..

- ఈ మేరకు విధివిధానాలను రూపొందించాలి
- ఎగవేతలకు పాల్పడేవారితో కఠినంగా వ్యవహరిస్తాం..
- మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తాం..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పౌర సరఫరాల శాఖపై ఉత్తమ్‌తో కలిసి సమీక్ష



**అక్షరశక్తి, హైదరాబాద్:** మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పౌర సరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిని వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు.

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వీబీ జీ రామ్ జీ లో ప్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ప్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సూచించారు.

ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగుతో రైతులకు అధిక ఆదాయం

**జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**అక్షరశక్తి, జనగామ :** రైతులు బహుళ అంతస్తుల, సమీకృత వ్యవసాయ విధానాలను అవలంబించి అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం రఘునాథపల్లి, ఘనపూర్ (స్టేషన్) మండలాల్లోని పలు రైతుల వ్యవసాయ క్షేత్రాలను కలెక్టర్ పరిశీలించి, సాగు విధానాలు, నీటి వినియోగం, పంటల దిగుబడులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులతో చర్చించారు.



రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామంలో రైతు మంద రాములు సుమారు రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న బహుళ అంతస్తుల వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. మునగ, సపోటా, సీతాఫలం, అరటి, అంజీర్, నిమ్మతో పాటు బీరకాయ, సొరకాయ తదితర పంటలను ఒకే భూమిలో సాగు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. పంటల సాగుకు చేసిన పెట్టుబడి, నిర్వహణ వ్యయం, దిగుబడులు, మార్కెటింగ్, ప్రభుత్వ సబ్సిడీల వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.

ఘనపూర్ (స్టేషన్) మండలంలో రైతు ఊర లింగయ్య సాగు చేస్తున్న సుమారు 8 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. గతంలో వరి సాగు చేసిన రైతు ప్రస్తుతం టమోటా, చిక్కుడు, బంతి, బెండకాయ వంటి కూరగాయలు, పూల పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణ చేపట్టడం ద్వారా నిరంతర ఆదాయాన్ని పొందే అవకాశాలను కలెక్టర్ వివరించారు.

ఘనపూర్ (స్టేషన్) మండలం ఛాగల్ గ్రామంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కలెక్టర్ ఫార్మ్ పాండ్స్, డ్రిప్ ఇరిగేషన్, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై రైతులతో మాట్లాడారు. వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేలా ఫార్మ్ పాండ్స్ నిర్మాణాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, కేవీకే శాస్త్రవేత్త రమ్య, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ ఉద్యోగాలకు తెలంగాణ యువతను సిద్ధం చేస్తాం..

**లెఫ్టినెంట్ జనరల్‌తో సీఎం రేవంత్**



**అక్షరశక్తి, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పీఆర్సీ, డీఏలు వెంటనే ప్రకటించాలి

**అక్షరశక్తి,శాయంపేట:** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలను వెంటనే ప్రకటించాలని యూఎస్పీసీ హనుమకొండ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. బుధవారం యూఎస్పీసీ నాలుగు దశల పోరాటంలో భాగంగా శాయంపేట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు డీఏలు వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో పెండల కుమారస్వామి, అల్లం మల్లయ్య, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.




# కేయూలో గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ లైబ్రరీ, కాకతీయ విశ్వవిద్యాలయ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (KULPA), లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం, తెలంగాణ స్టేట్ లైబ్రరీ అసోసియేషన్ (TSLA), వరంగల్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ డా. ఎస్. ఆర్. రంగనాథన్ 134వ జయంతి సందర్భంగా గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ లైబ్రరీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డా. ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా. ఎ. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, భారతదేశంలో గ్రంథాలయ ఉద్యమానికి డా. ఎస్.ఆర్. రంగనాథన్ చేసిన సేవలు అపూర్వమైనవని అన్నారు. KULPA ప్రధాన కార్యదర్శి వి. కృష్ణమాచార్య సంఘం వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వృత్తి నిపుణులు, విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. డి. సత్యనారాయణ రావు, ప్రొఫెసర్ కె. రమణయ్య, మెంబెర్ ఇంచార్జ్ విభాగాధిపతి డా. బి. రాధికా రాణి మాట్లాడారు. ఉత్తమ గ్రంథపాలకుడికి పురస్కారం గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా వివిధ పురస్కారాలను ప్రదానం చేశారు. ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథపాలకులు డా. బి. జగదీశ్‌కు "Best Librarian Award" అందజేశారు. 2024-25 MLISc ప్రథమ ర్యాంకర్ మిస్ మోరా నిఖితకు కొండల్ రెడ్డి మెమోరియల్ గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. అలాగే ఎం.ఫార్మసీ ద్వితీయ సెమిస్టర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మిస్ జి. కావ్యకు "Best Reader Award" అందజేశారు. కార్యక్రమంలో డా జి రాజేశ్వర్



కుమార్, ఎం కోటేశ్వర్ రావు, డా అంజయ్య, ఎం యుగంధర్ రావు, టి జవహర్, డా ఇంద్రసేన రెడ్డి, డా నిరంజన్ అనురాధ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# స్వేచ్ఛ లేని మీడియా.. బలహీన ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఎంత ముఖ్యమో, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే స్వతంత్ర మీడియా కూడా అంతే ముఖ్యం. ఓటరు తన నిర్ణయాన్ని తీసుకోవాలంటే ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలు, అవినీతి, అధికార దుర్వినియోగం, ఆర్థిక అసమానతలు, సామాజిక పరిణామాలపై నమ్మదగిన సమాచారం అవసరం. అందువల్ల పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కు మాత్రమే కాదు. అది ప్రజల సమాచార హక్కుకు, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి సంబంధించిన ప్రాథమిక హక్కు. మీడియా స్వేచ్ఛ బలహీనపడిన చోట "ప్రజాస్వామ్యం" కేవలం రూపంలో కొనసాగినా, దాని అంతర్గత జీవశక్తి క్రమంగా క్షీణిస్తుంది.



ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం మీడియా స్వేచ్ఛ అనేక వైపుల నుంచి ఒత్తిడికి గురవుతోంది. యుద్ధాలు, ప్రభుత్వ నియంత్రణ, రాజకీయ ధ్రువీకరణ, కార్పొరేట్ యాజమాన్యం, డిజిటల్ వేదికల ఆధిపత్యం, తప్పుడు సమాచారం, పాత్రికేయులపై ఆన్‌లైన్ దాడులు, ఆర్థిక సంక్షోభం... ఇవన్నీ కలిసి స్వతంత్ర జర్నలిజానికి నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. యునెస్కో 2026లో వెల్లడించిన గణాంకాల ప్రకారం 2012 నుంచి ప్రపంచవ్యాప్తంగా భావ ప్రకటనా స్వేచ్ఛ సూచికలో సుమారు 10 శాతం క్షీణత నమోదైంది. మీడియా వృత్తిలో ఉన్నవారిలో స్వీయ నియంత్రణ 63 శాతానికి చేరడం, ప్రభుత్వాలు మరియు శక్తివంతమైన వర్గాల మీడియా నియంత్రణ 48 శాతం పెరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. 2022 నుంచి 2025 సెప్టెంబర్ వరకు 310 మంది జర్నలిస్టులు హతమయ్యారు. వారిలో 162 మంది సాయుధ ఘర్షణలను కవర్ చేస్తూ ప్రాణాలు కోల్పోయారు.

ఈ సంక్షోభం యుద్ధ ప్రాంతాలకే పరిమితం కాలేదు. ప్రభుత్వాలు తమకు అనుకూలమైన సమాచార వ్యవస్థను నిర్మించుకోవడం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ధోరణి. మీడియాను ప్రత్యక్షంగా నిషేధించడం ఒక పద్ధతి అయితే, ఆర్థికంగా బలహీనపరచడం, ప్రకటనలను నియంత్రించడం, అనుమతులు లేదా గుర్తింపులను ఆయుధాలుగా ఉపయోగించడం, కేసులు పెట్టడం, జర్నలిస్టులపై వ్యక్తిగత దాడులు చేయడం, ప్రభుత్వ అనుకూల సంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం మరింత సూక్ష్మమైన పద్ధతులు. ఇవన్నీ కలిపి 'మీడియా మేనేజ్మెంట్' అనే కొత్త రాజకీయ సంస్కృతికి దారి తీస్తున్నాయి. ఇందులో మీడియాను పూర్తిగా మూసివేయరు. కానీ తమ అధికారాన్ని ప్రశ్నించకుండా ఉండే పరిస్థితిని సృష్టిస్తారు.

అమెరికా వంటి పత్రికా స్వేచ్ఛకు చారిత్రకంగా ప్రాధాన్యత ఇచ్చిన దేశంలో కూడా ఇటీవలి పరిణామాలు ఈ ప్రమాదం విశ్వవ్యాప్తమని సూచిస్తున్నాయి. ట్రంప్ రెండో పాలనలో పెంటగాన్ నుంచి వార్తలు సేకరించే పాత్రికేయులపై విధించిన పరిమితులు తీవ్ర వివాదానికి దారితీశాయి. 2025లో ప్రవేశపెట్టిన ఒక విధానం కింద అనుమతి లేని సమాచారాన్ని సేకరించే జర్నలిస్టులను భద్రతా ముప్పుగా పరిగణించే అవకాశం ఉండటంతో అనేక ప్రధాన మీడియా సంస్థలు దాన్ని తిరస్కరించాయి. 2026 మార్చిలో ఫెడరల్ కోర్టు ఆ విధానాన్ని రాజ్యాంగపరమైన కారణాలతో అడ్డుకున్నప్పటికీ, పెంటగాన్ కొత్త పరిమితులను అమలు చేసింది.

ఇదే సమయంలో విదేశీ జర్నలిస్టుల సామాజిక మాధ్యమ కార్యకలాపాల పరిశీలనకు సంబంధించిన అమెరికా విధానాలు కూడా విమర్శలకు గురయ్యాయి. 2026 ఆగస్టులో విదేశీ జర్నలిస్టుల అమెరికా వీసా దరఖాస్తుల్లో వారి సామాజిక మాధ్యమ ఖాతాలను పరిశీలించే విధానం విస్తరించనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ పరిణామాలు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రజాస్వామ్య దేశాల్లో కూడా 'జాతీయ భద్రత', 'తప్పుడు సమాచారం', 'ప్రభుత్వ ప్రతిష్ఠ' వంటి కారణాలు కొన్నిసార్లు సమాచార నియంత్రణకు సాధనాలుగా మారే ప్రమాదం ఉంది.

భారతదేశ పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారత్ 180 దేశాల్లో 140వ స్థానంలో ఉంది. అదే సూచికలో నార్వే, స్వీడన్, డెన్మార్క్ వంటి దేశాలు అగ్రస్థానాల్లో ఉండగా, భారత్ స్థానం ప్రజాస్వామ్య పరిమాణానికి సంబంధించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇది కేవలం ఒక ర్యాంకు మాత్రమేనని కొట్టి పారేయడం సరైంది కాదు. ఆ సూచికలో రాజకీయ, ఆర్థిక, చట్టపరమైన, సామాజిక భద్రత, మీడియా స్వాతంత్ర్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

భారతదేశంలో సమస్యను కేవలం ప్రభుత్వ ప్రత్యక్ష సెన్సార్‌షిప్‌తో అర్థం చేసుకోవడం సరిపోదు. మీడియా యాజమాన్య కేంద్రీకరణ, పెద్ద సంస్థల ఆర్థిక ప్రభావం, ప్రభుత్వ ప్రకటనలపై ఆధారపడటం, దర్యాప్తు సంస్థలు లేదా పోలీసులు ఉపయోగించే చట్టపరమైన చర్యలు, పరువు నష్టం కేసులు, ఇంటర్నెట్ మరియు డిజిటల్ కంటెంట్ పై నియంత్రణ, జర్నలిస్టులపై ఆన్‌లైన్ బెదిరింపులు... ఇవన్నీ కలిసి ఒక సంక్లిష్టమైన ఒత్తిడి వ్యవస్థను రూపొందిస్తున్నాయి. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ ప్రస్తుతం భారత్‌లో ఇద్దరు జర్నలిస్టులు నిర్బంధంలో ఉన్నారని నమోదు చేస్తోంది. పర్యావరణం, భూసేకరణ, అవినీతి వంటి అంశాలపై పరిశోధనాత్మక జర్నలిజం చేసే వారిపై ఒత్తిళ్ల ఉదాహరణలను కూడా ఆ సంస్థ నమోదు చేసింది.

ఇక్కడ మరో ప్రమాదకరమైన పరిణామం 'గోదీ మీడియా' వంటి రాజకీయ పదజాలం కంటే లోతైనది. ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరించే మీడియా ఉండటం ఒక్కటే సమస్య కాదు; ప్రతిపక్షాన్ని లేదా ప్రభుత్వ విమర్శకులను స్వయంచాలకంగా శత్రువులుగా చూపించే సమాచార వాతావరణం ఏర్పడటం అసలు సమస్య. వార్త, అభిప్రాయం, ప్రచారం మధ్య సరిహద్దులు చెరిగిపోతే పౌరుడు ఏది వాస్తవం, ఏది రాజకీయ ప్రచారం అనే విషయాన్ని నిర్ణయించుకోవడం కష్టమవుతుంది. టెలివిజన్ చర్చల్లో సంచలనం వార్తను మించిపోతుంది. సామాజిక మాధ్యమాల్లో వేగం, వైరల్ కావడం, భావోద్వేగాలను రెచ్చగొట్టడం వాస్తవ నిర్ధారణను వెనక్కినెడుతున్నాయి.

అయితే మీడియా స్వేచ్ఛ అంటే జర్నలిస్టులకు బాధ్యతలేమీ లేవని కాదు. అసత్య ప్రచారం, వ్యక్తిగత దూషణ, మత విద్వేషం, మహిళలు లేదా అణగారిన వర్గాలను కించపరిచే భాష, నిర్ధారణ లేని ఆరోపణలు ప్రజాస్వామ్య జర్నలిజం కావు. స్వేచ్ఛతో పాటు వృత్తిపరమైన నైతికత, వాస్తవ నిర్ధారణ, మూలాల రక్షణ, సమతుల్యత, ప్రజా ప్రయోజనం పట్ల నిబద్ధత అవసరం. అయితే జర్నలిజంలో తప్పు జరిగితే దానికి చట్టబద్ధమైన, పారదర్శకమైన పరిష్కార మార్గాలు ఉండాలి. విమర్శను అణచివేయడానికి అత్యంత కఠినమైన చట్టాలను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదకరం.

డిజిటల్ యుగం ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. కృత్రిమ మేధస్సు ద్వారా నకిలీ వీడియోలు, మార్ఫింగ్, డీప్‌ఫేక్‌లు, స్వయంచాలకంగా తయారయ్యే తప్పుడు కథనాలు పెరుగుతున్నాయి. ఒకవైపు వీటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది; మరోవైపు 'తప్పుడు సమాచారం నిరోధం' పేరుతో నిజమైన విమర్శను కూడా అణచివేయకుండా జాగ్రత్తపడాలి. యునెస్కో కూడా కృత్రిమ మేధస్సు ఆధారిత తప్పుడు సమాచారం, ఆర్థిక ఒత్తిళ్లు, సంఘర్షణలు ప్రపంచ మీడియా స్వేచ్ఛను దెబ్బతీస్తున్న ప్రధాన అంశాలని గుర్తించింది.

అందుకే పరిష్కారం ప్రభుత్వ వ్యతిరేక మీడియా నిర్మాణం కాదు; ప్రభుత్వాన్ని కూడా, ప్రతిపక్షాన్ని కూడా, కార్పొరేట్లను కూడా, స్వయంగా మీడియాను కూడా ప్రశ్నించగల స్వతంత్ర మీడియా వ్యవస్థ నిర్మాణం. మీడియా యాజమాన్యంలో పారదర్శకత, ప్రభుత్వ ప్రకటనల పంపిణీలో స్పష్టమైన ప్రమాణాలు, జర్నలిస్టుల భద్రత, మూలాల రక్షణ, ప్రజా ప్రసార సంస్థల స్వయం ప్రతిపత్తి, డిజిటల్ వేదికలలో పారదర్శకత, సమాచార హక్కు రక్షణ, మీడియా సంస్థలకు న్యాయపరమైన రక్షణ వంటి సంస్కరణలు అవసరం.

చివరికి ప్రశ్న 'మీడియా ఎవరి వైపు ఉంది?' అన్నది కాదు. మీడియా నిజం, ప్రజా ప్రయోజనం, రాజ్యాంగ విలువల వైపు ఉందా? అన్నదే అసలు ప్రశ్న. అధికారానికి దగ్గరగా ఉండటం జర్నలిజం కాదు; అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం ఉన్నప్పుడే అది ప్రజా జర్నలిజంగా నిలుస్తుంది. మీడియా గొంతు మూయించబడినప్పుడు నష్టపోయేది ఒక్క జర్నలిస్టు మాత్రమే కాదు. ప్రజల తెలుసుకునే హక్కు, ప్రభుత్వ జవాబుదారీతనం, చివరికి ప్రజాస్వామ్యమే. అందువల్ల పత్రికా స్వేచ్ఛను కాపాడటం మీడియా సంస్థల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి ప్రజాస్వామ్య పౌరుడి హక్కును కాపాడే సామాజిక బాధ్యత కూడా.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.